క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రిలో ఇమ్యూనైజేషన్ సేవలు

గజ్వేల్‌రూరల్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రిలో ఇమ్యూనైజేషన్ సేవలను ప్రారంభించినట్లు ఇన్‌చార్జి వాసు తెలిపారు. పట్టణంలో నూతన మతా శిశు ఆరోగ్య కేంద్రం ఆస్పత్రిలోకి ఇమ్యూనైజేషన్ సేవలు మార్చినట్లు చెప్పారు. పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల పిల్లల వరకు టీకాలు వేస్తామన్నారు. పిల్లల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9908472511 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీఐ సత్యనారా యణ రెడ్డి సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శనివారం మండల పరిధిలోని గుర్జకుంట జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే బాలికలు, మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా వేధించినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా డయల్ 100, షీటీం సిద్దిపేట వాట్సాప్ నంబర్ 8712667343కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఎం విజయలక్ష్మి, హుస్నాబాద్ డివిజన్ షీటీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో బీఆర్ఎస్‌పై వ్యతిరేకత



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్‌పై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు పర్శరాములు, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ నాగరాజు అన్నారు. శనివారం చిన్నకోడూరులో వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజిరెడ్డి, శివరాంగౌడ్, రవీందర్, విష్ణుమూర్తి, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో 100 నామినేషన్లు వేస్తాం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గుడాటిపల్లి వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులు దాదాపుగా 100 మంది ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్లు వేయనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విలువైన భూములు, ఇండ్లు కోల్పోయినా.. పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పశువుల కొట్టాలు, ఇంటి అడుగు స్థలాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. కామారెడ్డి రైతుల మాదిరిగా హుస్నాబాద్‌లో సైతం నామినేషన్లు వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి

హుస్నాబాద్: హుస్నాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఆదర్శ ఉద్యోగులకు సన్మాన సభ నిర్వహించారు. 2023 సెప్టెంబర్ నెలకు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు సన్మాన పత్రాలు అందజేశారు. అత్యధిక ఆదాయం తీసుకొచ్చిన డ్రైవర్, కండక్టర్లకు నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హుస్నాబాద్ డిపోను లాభాల బాటలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నర్సయ్య, డిపో సూపరింటెండెంట్ శ్రీధర్, అకౌంటెంట్ లక్ష్మారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. ఇదే విషయమై శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా వరి కోతలు ప్రారంభించి 15 రోజులు అయిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తేలు ఇస్తారి, వుల్లంపల్లి సాయిలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రాఘవాపూర్‌లో పోలీసుల కవాతు

స్వేచ్ఛగా ఓటెయ్యండి

ఓటు వజ్రాయుధమని, ప్రజలు ఎవరికి భయపడకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏసీపీ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు రూరల్ మండల పరిధిలోని రాఘవాపూర్‌లో ఏసీపీ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ బలగాలతో ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ కిరణ్‌రెడ్డి, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, బీఎస్ఎఫ్ అధికారులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

– సిద్దిపేటరూరల్



బస్సులో తనిఖీలు చేపడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

జిల్లాలో 10 చెక్ పోస్టులు

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, కేంద్ర బలగాలతో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నట్టు అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తనిఖీల్లో రూరల్ సీఐ చేరాలు, ఎస్సై కిరణ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

– సిద్దిపేటఅర్బన్

‘పల్లా’ కే మా మద్దతు

మద్దూరు(హుస్నాబాద్): జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మండలంలోని సలాఖపూర్‌కు చెందిన కురుమ కులస్తులు తెలిపారు. శనివారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. గొల్ల కురుమల అభివృద్ధికి కృషి చేసిన బీఆర్ఎస్‌కే మా మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈమేరకు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు పుట్ట వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఐలయ్య, లింగం, తదితరులు పాల్గొన్నారు.



పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తీర్మానపత్రాన్ని అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



వృద్ధురాలితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత తదితరులు

దుబ్బాక: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో కార్యకర్తలతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదగిరి, మున్సిపల్ అధ్యక్షుడు వంశీకృష్ణ గౌడ్, రాజమౌళి పంతులు, ఎల్లం, రాజు, ఖలీల్ పాల్గొన్నారు.

అమరుల కుటుంబాలకు అన్యాయం



మాట్లాడుతున్న అమరవీరుల కుటుంబ సభ్యులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తెలంగాణ అమరవీరుల, ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ న్యాయం చేయలేదని తెలంగాణ అమరవీరుల కుటుంబాల రాష్ట్ర ఐక్యవేదిక, దళిత సంఘాల జేఏసీ అధ్యక్షుడు రఘుమారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వ్యవసాయక్షేత్రాన్ని నవంబర్ 1న ముట్టిడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది దళిత, బహుజనులు బలి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 5 వేల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు రాక ఆత్మబలిదానాలు చేసుకున్నారని వాపోయారు. సీఎం కేసీఆర్‌పై 200 మంది అమరవీరుల కుటుంబ సభ్యులు నామినేషన్లు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అమరవీరుల కుటుంబాల సభ్యులు మమత, సునిత, ప్రేమలత, లక్ష్మమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దుబ్బాక అభివృద్ధి

మిరుదొడ్డి(దుబ్బాక)/తొగుట: కాంగ్రెస్‌తోనే దుబ్బాక అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మద్దెల రాజేష్ అన్నారు. దుబ్బాక కాంగ్రెస్ టికెట్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మిరుదొడ్డిలో సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు అర్షద్, సుదర్శన్, మహేందర్, మహేష్, రాజు, కన్నారెడ్డి, గణేష్, ప్రశాంత్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే తొగుట మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.

‘ఈటల’కు ఓటమి తప్పదు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌కు ఓటమి తప్పదని ఈటల దళిత బాధితుల సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఈటల దళిత బాధితుల సంఘం అధ్యక్షుడు తిప్పారపు సంపత్ మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో గ్రామగ్రామాన ఈటల బాధితులున్నారని పేర్కొన్నారు. అక్రమాలపై ప్రశ్నించిన వారిపై తన అనుచరులతో దాడులు చేయించారని ఆరోపించారు. ఈటల రాజేందర్ అక్రమాలను గ్రామగ్రామాన తెలియజేందుకు త్వరలో బస్సు యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈటల బాధిత దళిత సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడంతో పాటు మళ్లీ సీఎం కావాలని కోరుతూ మండలంలోని లింగారెడ్డిపల్లికి చెందిన అయ్యప్ప భక్తుడు పాండు ముదిరాజ్ శనివారం శబరికి పాదయాత్ర ప్రారంభించారు. ఉదయం హైదరాబాద్‌లోని అల్వాల్ అయ్యప్ప దేవాలయంలో పూజలు చేసి అక్కడి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. శబరి వరకు పాదయాత్ర చేసి స్వామికి ముడుపు కట్టి గెలవగానే ముడుపు చెల్లిస్తానని ఆయన చెప్పాడు.



శబరికి పాదయాత్రగా వెళ్తున్న పాండు

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



కనకవ్వ(ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): మనస్తాపంతో మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రెడ్డి కనకవ్వ (55) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మారెడ్డి భార్య కనకవ్వ ఇంటి విషయంలో గొడవపడ్డారు. లక్ష్మారెడ్డి ఇంట్లో నుంచి బయటకు వెళ్లగా కనకవ్వ క్రిమిసంహారక మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పిస్తాం

గజ్వేల్ ఏసీపీ రమేష్

కొండపాక(గజ్వేల్): గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పిస్తామని, నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని గజ్వేల్ ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రం, చిన్నకిష్టాపూర్‌లో తొగుట సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి శనివారం రాత్రి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతీ ఒక్కరు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. అభ్యర్థులు డబ్బు, మద్యం పంపిణీ వంటి ప్రలోభాలకు గురి చేసినా ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పుష్పరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మరొకరు.

బెజ్జంకి(సిద్దిపేట): అనారోగ్య బాధలు తాళలేక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గుండారం గ్రామంలో జరిగింది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంపెల్లి సంజీవ్ (45) దంపతులు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా సంజీవ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం పని ఉందని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తమ వ్యవసాయ బావి వద్ద చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గమనించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

‘కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం’

గజ్వేల్‌రూరల్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని గజ్వేల్ మండల మాజీ సర్పంచ్‌లు పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బాలమణి, రాంరెడ్డి, కొమురయ్య, నర్సింలు, సత్యనారాయణ, దుర్గారెడ్డి, అశోక్, మల్లిఖార్జున్, రాజాగౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈసంఘటన మండలంలోని దుద్దెడ శివారు సమీకృత కలెక్టరేట్ సమీపంలో శనివారం జరిగింది. సిరిసిల్ల జిల్లాకు చెందిన శివ బైక్‌పై హైదారాబాద్ వెళ్తున్నాడు. ఈక్రమంలో మరో బైక్‌పై దంపతులు వీరేశలింగం, బాలమణి సిద్దిపేట నుంచి కలెక్టరేట్‌కు వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో శివ కుడి చేయి విరగగా వీరేశం, బాలమణికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆలయాల మూసివేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆదివారం రాత్రి 1.06 గంటల నుంచి ఉదయం 2.25 గంటల వరకు ఏర్పడే పాక్షిక చంద్రగ్రహణం కారణంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆలయాలను మూసివేశారు. ఈమేరకు ఆలయాల వద్ద భక్తులకు తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ చేసి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని అర్చకులు తెలిపారు.



వెంకటేశ్వర ఆలయం మూసివేత

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

హుస్నాబాద్ సీఐ కిరణ్

హుస్నాబాద్‌రూరల్: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ ఎర్రల కిరణ్ హెచ్చరించారు. శనివారం పందిల్ల స్టేజీ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు ఉండడంతో వారిని అక్కడ దింపి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యం చేరుకుంటామని, ఆటోల్లో ప్రయాణించి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్సై మహేశ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **10 మంది బైండోవర్**

తొగుట(దుబ్బాక): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 మందిని తహసీల్దార్ శ్రీకాంత్ ఎదుట శనివారం బైండోవర్ చేసినట్టు ఎస్ఐ లింగం తెలిపారు.

◆ **గుడుంబా స్థావరాలపై దాడి**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం గ్రామం వడ్డెర కాలనీ, చెరువు పరిసర ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలపై అధికారులు దాడులు నిర్వహించారు. సుమారు 300 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. ఈసందర్భంగా హుస్నాబాద్ ఎస్‌హెచ్‌ఓసీ పవన్ మాట్లాడుతూ.. నాటు సారా తయారు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



◆ **బెజ్జంకి ఎంపీపీ ఇంట్లో తనిఖీలు**

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలోని ఎంపీపీ లింగాల నిర్మల ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి మండల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది విష్ణు ఆధ్వర్యంలో సోదాలు చేశారు. సీ–విజిల్ యాప్‌లో బెజ్జంకి ఎంపీపీ ఇంటి వద్ద డబ్బులు నిల్వ ఉన్నాయని ఫిర్యాదు రాగా దీనిపై ఎన్నికల రిటర్నింగ్ ఇచ్చిన సమాచారం మేరకు మేరకు తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు బురదజల్లేందుకే ఇలాంటి ఫిర్యాదులు చేస్తున్నారని ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు.

◆ **కాంగ్రెస్‌తోనే మేలు**

కోహెడరూరల్(హుస్నాబాద్): కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా రైతులకు అండగా నిలుస్తుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. శనివారం మండలంలోని పోరెడ్డిపల్లిలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

◆ **నేడు బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం**

తొగుట(దుబ్బాక): దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం మండలంలో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని పార్టీ నాయకులు తెలిపారు. మండలంలోని జప్తి లింగారెడ్డిపల్లిలో శనివారం వారు మాట్లాడారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి ప్రభాకర్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్‌కు రాజీనామా**

బెజ్జంకి(సిద్దిపేట): బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జెల్ల ప్రభాకర్ తన పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి శనివారం రాజీనామ చేశారు. పార్టీలో తనకు గుర్తింపు లేదనే మనస్తాపంతో రాజీనామ చేసినట్లు తెలిపారు.

◆ **కరపత్రాల ఆవిష్కరణ**

సిద్దిపేటకమాన్: నవంబర్ 5న నిర్వహించే మాదిగల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో యుద్ధభేరికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాపయ్య, కాశపాక రాజేందర్, చందు, ప్రశాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీకి పలువురి రాజీనామా**

బెజ్జంకి(సిద్దిపేట): మండలానికి చెందిన ఓబీసీ నాయకులు సాన వేణు, మండల పార్టీ అధ్యక్షుడు దోనె అశోక్‌తో పాటు పలువురు శనివారం బీజేపీకి రాజీనామా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దరువు ఎల్లన్న వెంటే ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, అధికార ప్రతినిధి మహేష్, శంకర్, వెంకటేశం, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

◆ **సబ్‌స్టేషన్‌ను ప్రారంభించాలి**

చేర్యాల(సిద్దిపేట): నిర్మాణ పనులు పూర్తయిన మండలపరిధిలోని కడవేర్గు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వెంటనే ప్రారంభించి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ మండల కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి శనివారం డిమాండ్ చేశారు.

◆ **కాంగ్రెస్ నేతలను అడ్డుకోవాలి**

మద్దూరు(హుస్నాబాద్): రైతుబంధును నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో అడుగు పెట్టనివ్వొద్దని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆరిఫ్, నాయకులు పుట్ట వెంకటరమణారెడ్డి, నాంపల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.